శాంతియుతంగా ఉత్సవాలు


జడ్చర్లలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు


గండేడ్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: వినాయక చవితి నవరాత్రులతో పాటు ఇతర పండగలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని రూరల్ సీఐ గాంధీ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన శాంతికమిటీ సమావేశంలో సీఐ మాట్లాడారు. గణేష్ ఉత్సవాలు మండప నిర్వాహకులు పవిత్రంగా ఉంటూ 9రోజుల పాటు పూజలు నిర్వహించాలని కోరారు. పోలీస్ సూచన మేరకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జడ్చర్ల: పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది పట్టణంలో గణేష్ ఉత్సవాలకు ముస్లిం, క్రిస్టియన్‌లు కూడా సహకరించడం అభినందనీయమన్నారు. ఈసారి కూడా అదేవిధంగా సహకరించి ఇతర ప్రాంతాలకు స్ఫూర్తిగా నిలవాలని కోరారు.

అడ్డాకుల: వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా ముగిసేందుకు నిర్వాహకులు సహకరించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. మూసాపేట మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం అన్ని గ్రామాలకు చెందిన ఉత్సవాల నిర్వాహకులతో సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. ఏర్పాటు చేసే వినాయకుల వివరాలను స్టేషన్‌లో నమోదు చేయించాలని కోరారు.

గండేడ్: శాంతియుత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సల్కర్‌పేట్‌లో శాంతి కమిటి సమావేశం నిర్వహించారు. డీజేలు, మైక్‌సెట్‌లకు అమతులు తప్పనిసరి అన్నారు. మండపం వద్ద ఇద్దరు బాధ్యతలు తీసుకుని కార్యక్రమాలు సజావుగా కొనసాగించేలా చూడాలని సూచించారు.

భూత్పూర్: వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా చేసుకోవాలని సీఐ రామకృష్ణ అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయకుడి విగ్రహ ప్రతిష్ట చేసేవారు పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించాలని, మండపాల ఏర్పాటు చేసిన వారిదే పూర్తి బాధ్యత తీసుకోవాలని తెలిపారు.

దేవరకద్ర: గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతవరణంలో చేసుకోవాలని ఎస్‌ఐ నాగన్న సూచించారు. బుధవారం సాయంత్రం పోలీసు స్టేషన్ ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులు, వినాయక మండప నిర్వాహకులతో శాంతి కమిటీ సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో, ఇతరత్ర పూజలకు డీజేలు పెట్టరాదని కోరారు.

చిన్నచింతకుంట: పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం గణేష్ మండపాల నిర్వహకులతో ఎస్‌ఐ ఆర్.శేఖర్ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

క్లుప్తంగా

నాగారంలో వైద్య శిబిరం



దేవరకద్ర రూరల్: నాగారం గ్రామంలో బుధవారం ప్రీతి ప్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణుడు చంద్రమోహన్ రోగులను పరీక్షించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతినెల గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బ్లడ్‌షుగర్, బీపీ, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్, యూరిన్ పరీక్షలతో పాటు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చంద్రమోహన్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రూప, గణేష్, రాజేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి



గండేడ్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్ పేర్కొన్నారు. బుధవారం సభ్యత్వ నమోదులో భాగంగా మండలంలోని పలు పాఠశాలల్లో ఆయన పర్యటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండు చేశారు. కార్యక్రమంలో జనార్దన్, శ్రీకాంత్, కొండయ్య, రాధిక, వైవి రావు, రాజేందర్‌రెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డీఎంకు వినతి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఆర్టీసీ బస్సులు పెంచాలని, సమయానికి నడపాలని కోరుతూ చింతకుంట, లాల్‌కోట గ్రామస్తులు, విద్యార్థులు బుధవారం డీఎం సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ వయా లాల్‌కోట, వడ్డేమాన్, చింతకుంట, ఆత్మకూర్ రూట్‌లో ప్రస్తుతం నడుపుతున్న బస్సులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సురేశ్, దేవానంద్, కరుణాకర్, తిమోతి, ఫారూక్ హుస్సేన్, భూమిక, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందం తనిఖీ చేస్తుంది. బుధవారం అప్పన్నపల్లి లోని సర్వే నం.168, 179, 181లలో మొత్తం 60 ప్లాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్‌ఆర్‌ఎస్ నోడల్ ఆఫీసర్ ముకుంద్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, టీపీఓ లక్ష్మీపతి, రెవెన్యూ ఆర్‌ఐ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన ఆంజనేయ స్వామి నామస్మరణ



దేవరకద్ర: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ బీసీ కాలనీలో నిర్మించిన ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో బుధవారం ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా దేవాలయంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం బుధవారం ఉదయం నుంచి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని పునః ప్రతిష్టించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు స్వామి నామస్మరణ చేస్తూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం ధ్వజస్తంభ, నవగ్రహాల ప్రతిష్ఠ చేపట్టారు.

బస్సు నిలపలేదని విద్యార్థుల ధర్నా


పెద్దవడ్డేమాన్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థులు

చిన్నచింతకుంట: ఆర్టీసీ బస్సు గ్రామంలో నిలపడం లేదంటూ మండలంలోని పెద్దవడ్డేమాన్ బస్టాండ్ సమీపంలో బుధవారం విద్యార్థులు, గ్రామస్తులు బస్సుకు అడ్డంగా ధర్నా చేపట్టారు. విద్యార్థులు మాట్లాడుతూ వారం రోజులుగా ఆత్మకూర్ పట్టణం నుంచి దేవరకద్రకు వడ్డేమాన్ మీదుగా 8 గంటలకు వెళ్లే ఆర్టీసీ బస్సును నిలపడం లేదన్నారు. బస్సును నిలపకపోవడంతో దేవరకద్రకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు వెళ్లే విద్యార్థులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలల్లో పనిచేసేందుకు వెళ్లే ఉద్యోగస్తులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్సును ఎందుకు నిలపడం లేదని పలుమార్లు కండక్టర్, డ్రైవర్‌ను అడగగా ఆత్మకూర్ నుంచే ప్రయాణికులు ఎక్కువగా ఉంటున్నారని బస్సులో స్థలం లేనందున నిలపడం లేదని చెబుతున్నారన్నారు. విద్యార్థులు, ఉద్యోగస్తులు వెళ్లే సమయంలోనే బస్సులు లేకపోతే ఎలా అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు 8:30 గంటలకు అదనంగా మరో బస్సును నడిపించాలని డిమాండ్ చేశారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరద గాలెన్న డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేట్ ఇన్సూరెన్సు కంపెనీలకు ఇవ్వరాదని డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టిన 40 ఏళ్ల పోరాటం ఫలితంగా 2006లో భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు ప్రమాద బీమా, పెళ్లి కానుక, ప్రసవ కానుక, సాధారణ మరణానికి నిధులు అందుతున్నాయని, నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డు పనితీరును నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుందన్నారు. వెల్ఫేర్ బోర్డులో నిధులను కాజేయడానికి ఎల్ఐసీ, ఇతర ప్రైవేట్ బీమా సంస్థలకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. లేని పక్షంలో కార్మికులందరినీ ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓకు అందజేశారు. కార్యక్రమంలో కిల్లెగోపాల్, కురుమూర్తి, వెంకటయ్య, రాజ్‌కుమార్, టంకర కృష్ణయ్య, వరద లక్ష్మయ్య, అరుణ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల తనిఖీ


జిల్లా కేంద్రంలోని వసతి గృహంలో సరుకులను పరిశీలిస్తున్న కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి


దేవరకద్రలో గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు


మహమ్మదాబాద్ ఎస్సీ వసతిగృహంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి బుధవారం స్థానిక షాషాబ్‌గుట్ట ప్రాంతంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాలకు చెందిన వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వంట గదిలో బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను, విద్యార్థులకు వడ్డించే వంటకాలను పరిశీలించారు. అలాగే తెలంగాణ మైనారిటీల రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలను ఏఎంసీ జె.పవన్‌కుమార్ తనిఖీ చేశారు.

మెను ప్రకారం భోజనం అందించాలి: డీఈఓ.

కోయిల్‌కొండ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే పౌష్టికాహారాన్ని మెనూ ప్రకారం తప్పనిసరిగా అందించాలని డీఈఓ రవీందర్ అన్నారు. బుధవారం మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల, ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను బుధవారం సాయంత్రం అధికారులు తనిఖీ చేశారు. వెంకటసాయి విద్యానికేతన్ ప్రైవేట్ భవనంలో ఉన్న గురుకుల పాఠశాలను చిన్నచింతకుంట తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీఓ అనిల్‌కుమార్ పరిశీలించారు.

మహమ్మదాబాద్: ప్రభుత్వ వసతి గృహాల్లో వసతులపై అధికారులు ఆరా తీశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో తనిఖీలు చేశారు. రోజువారి మెనూ, బియ్యం, కూరగాయలు నాణ్యతతో ఉన్నాయా? గదులు, బాత్‌రూంలు, తాగునీరు పరిశుభ్రంగా ఉన్నాయా అని పరిశీలించారు. భోజనంలో నాణ్యత లేదని వార్డెన్ శ్రీనివాస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మెనూ పాటించడంలేదని విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీటన్నింటిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించనున్నట్లు వారు తెలిపారు.

వారసత్వంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు


మాట్లాడుతున్న నాగేంద్రస్వామి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వారసత్వంపై విద్యార్థులలో అవగాహన పెంచేందుకు ఇన్‌టాచ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ మోడల్ బేసిక్ హైస్కూల్‌లో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మొత్తం 17 జట్లు పాల్గొనగా గెలుపొందిన మూడు జట్లకు వరుసగా మొదటి, రెండు, మూడో బహుమతులను అందజేశారు. చిన్నచింతకుంట మండలంఉంద్యాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన కె.మంజుల, గోవిందమ్మ జట్టు మొదటి బహుమతి సాధించింది. ఈ జట్టు త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే క్విజ్ పోటీల్లో పాల్గొననుంది. కోయిల్‌కొండ మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐశ్వర్య, కె.అనూష జట్టు రెండో బహుమతిని కైవసం చేసుకుంది. ఇన్‌టాచ్ మహబూబ్‌నగర్ చాప్టర్ కన్వీనర్ డా.టి.నాగేంద్రస్వామి మాట్లాడుతూ మొదట ఈనెల 20, 21, 22వ తేదీలలో మండలస్థాయిలో నిర్వహించామన్నారు. జిల్లాలోని 95 పాఠశాలలకు చెందిన 274 జట్లు పాల్గొన్నాయన్నారు. అక్కడి నుంచి ఒక్కొక్క జట్టు చొప్పున మొత్తం 17 జట్లను జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక చేశామన్నారు. మండల స్థాయిలో పాల్గొన్న విద్యార్థులకు బుక్స్ అందజేశామన్నారు. కార్యక్రమంలో మోడల్ బేసిక్ హైస్కూల్ హెచ్‌ఎం బాసిత్, ఇన్‌టాచ్ మహబూబ్‌నగర్ చాప్టర్ కో- కన్వీనర్ చంద్రకుమార్ గౌడ్, అదనపు కో-కన్వీనర్ వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, సభ్యులు టి.కె.ఎస్. శర్మ, రమేష్‌చందర్, జి.శ్రీనివాస్, క్విజ్ మాస్టర్ టి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి విరాళం అందజేత



దేవరకద్ర: దేవరకద్ర రైల్వే స్టేషన్‌లో ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్ రూ. 25,116 లను ఆలయ కమిటీ వారికి బుధవారం విరాళం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

31న స్వేరోస్ జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబ్‌నగర్ న్యూటౌన్: స్వేరోస్ కమిటీల ఏర్పాటులో భాగంగా 31న జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జిల్లా కమిటీని ఎన్నుకోనున్నట్లు స్వేరోస్ నాయకుడు లక్ష్మణ్ ప్రకటనలో తెలిపారు. ఉత్సాహవంతులైన యువత ఈ కమిటీ నిర్మాణంలో పాల్గొని మహనీయుల ఆశయాలను పల్లెపల్లెకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

ఐకేపీ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఐకేపీ వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఐకేపీ వీఓఏల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వాస్య బేగంలతో కలిసి ఆయన మాట్లాడారు. వీఓఏలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ సంఘం నుంచి ఇవ్వాల్సిన రూ.3 వేలు తక్షణమే విడుదల చేయాలని, జీఓ నంబర్ 58ను సవరించి మూడు నెలల రెన్యూవల్ పద్ధతిని రద్దు చేయాలన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ ఏఓ శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకటయ్య, ధర్మానాయక్, దేవమని, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిద్దాం


స్థానిక తెలంగాణ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన పోరాటంలో అమరులైన అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో సీపీఎం, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో విద్యుత్ పోరాట అమర వీరుల 24వ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ నిర్వహించగా అప్పటి చంద్రబాబు ప్రభుత్వం బషీర్‌బాగ్‌లో కాల్పులు జరిపిందన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలని నిరసన తెలిపామన్నారు. నాటి పోరాట ఫలితంగా విద్యుత్ ప్రైవేటీకరణ ఆగిందని తెలిపారు. నేడు మళ్లీ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం రైతులు, ప్రజలపైన విపరీతమైన భారాలు మోపేందుకు సిద్ధమైందన్నారు. ఫెడరల్ వ్యవస్థకు ముప్పు తెచ్చే విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లవెల్లి కురుమూర్తి, వరద గాలెన్న, చంద్రకాంత్, పద్మ, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జడ్చర్లకు సెట్విన్ చైర్మన్ రాక

జడ్చర్ల: పట్టణంలో సెట్విన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసేందుకు గురువారం చైర్మన్ గిరిధర్‌రెడ్డి, ఎండీ వేణుగోపాల్ వస్తున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. నిరుద్యోగ యువతకు వివిధ ఉపాధి రంగాలకు సంబంధించి శిక్షణలు ఇవ్వడం కోసం సెట్విన్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కంప్యూటర్ ఎడ్యుకేషన్, కంప్యూటర హార్డ్ వేర్, ఎయిర్ లైన్ టికెటింగ్, సెల్‌ఫోన్ రిపేర్, ప్రింటింగ్ ప్రెస్, బ్యూటీషియన్, కటింగ్ అండ్ టైలరింగ్ తదితర విభాగాలలో శిక్షణ పొందే అవకాశం ఉందన్నారు.

వీహెచ్‌పీఎస్ జెండా ఆవిష్కరణ

జడ్చర్ల టౌన్: వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ నేతృత్వంలో జరిగిన ఉద్యమాల వల్లే పింఛన్ రూ.200 నుంచి రూ.6వేలకు పెరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో బిచ్యానాయక్, శ్రీనివాసులు, రాజశేఖర్, రమేష్, వెంకటయ్య, రాణి చౌహాన్, దేవయ్య, ఖాదర్ పాల్గొన్నారు.

కరాటేలో 'భాష్యం' విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్ క్రీడలు: ఇటీవల హైదరాబాద్‌లో టైగర్ షోటోకాన్ కరాటే అకాడమీ, డైనమిక్ షోటోకాన్ ఆధ్వర్యంలో జరిగిన ఓపెన్ నేషనల్ కరాటే టోర్నమెంట్‌లో జిల్లా కేంద్రంలోని భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ మాధవి, మాస్టర్ ఎస్‌కే.మోసిన్ తెలిపారు. ఈ పోటీల్లో బాలుర కుమితే అండర్-10 విభాగంలో భరత్‌తేజ, మారుతి బంగారు పతకాలు, అండర్-12లో శివప్రసాద్‌రెడ్డి, అఖిల్, అండర్-13లో సృజన్ చక్రవర్తి కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను బుధవారం పాఠశాల ప్రాంగణంలో అభినందించారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు



రాజాపూర్: మండల కేంద్రంలోని శివసీతారామాంజనేయస్వామి ఆలయ ఆవరణలో బుధవారం భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కృష్ణాష్టమి మరుసటిరోజు గ్రామంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం ఆలయ వరణలో ఉట్లు కొట్టే ఆనవాయితీ ఏళ్లుగా వస్తుంది. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

కార్యవర్గం ఎన్నిక

పాలమూరు: కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ యూనియన్ జనరల్ ఆస్పత్రి బ్రాంచ్ అధ్యక్షుడిగా గోపాల్ నాయక్, కార్యదర్శిగా సతీష్‌కుమార్‌రెడ్డిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకట్‌రాంరెడ్డి, సహాయ కార్యదర్శిగా సాజిద్‌ఖాన్, కోశాధికారిగా బుచ్చన్న, ఉపాధ్యక్షులుగా ఖాదర్, మురళీలను ఎన్నుకున్నారు.

'కార్మిక సమస్యలను పరిష్కరించాలి'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర నర్సింహులు, ప్రచార కార్యదర్శి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పనిచేసిన సిబ్బందికి రావాల్సిన అలవెన్సు బకాయిలు చెల్లించాలన్నారు. వినాయక నిమజ్జనమప్పుడు 36 గంటల విధులు నిర్వహించిన వారికి మరుసటి రోజు సగం దినం సెలవు ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి మూడు నెలలకోసారి చీపుర్లు అందజేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు పండుగ సెలవులు ఇవ్వాలన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులను కాంట్రాక్టు వర్కర్స్‌గా గుర్తించాలన్నారు. చనిపోయిన కాంట్రాక్టు కార్మికుల దహన సంస్కారాలకు ఇచ్చే డబ్బులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కిల్లె గోపాల్, కురుమూర్తి, కె.యాదమ్మ, చిన్నికృష్ణ, విశ్వనాథం, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పీయూ విద్యార్థినికి డాక్టరేట్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పాలమూరు యూనివర్సిటీ తంగాలిపల్లి స్వాతికి డాక్టరేట్ లభించింది. రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధన రంగంలో నూతన ఆవిష్కరణల ద్వారా, పేటెంట్స్ ద్వారా నాక్‌లో యూనివర్సిటీకి మంచి గ్రేడ్ వస్తుందని తెలిపారు. బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్‌పర్సన్ అసోసియేట్ ప్రొఫెసర్ నూర్జహాన్, ప్రొ.గిరిజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, విభాగ అధ్యాపకులు విజయలక్ష్మి పలువురు అవార్డు సాధించిన స్వాతిని అభినందించారు.

వైభవంగా చౌడేశ్వరిమాత బోనాలు


బోనాలను ఊరేగిస్తున్న యన్మన్‌గండ్ల గ్రామస్తులు


జంగమయ్యపల్లిలో బోనాల ఊరేగింపులో మన్నె జీవన్‌రెడ్డి

నవాబుపేట: మండలంలోని యన్మన్‌గండ్లలో చౌడేశ్వరిమాత బోనాలు బుధవారం నిర్వహించారు. చౌడమ్మ దేవతకు భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. అలాగే బోనాలు సమర్పించారు. జంగమయ్యపల్లిలో గ్రామ దేవతల బోనాల కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు మన్నె జీవన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో కోట మైసమ్మ బోనాలను బుధవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ప్రదక్షిణ చేశారు.